నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 15 మార్చి 2025 | ADILABAD NIRMAL


### ❖ పంట చేతికొచ్చుడు కష్టమే..



నా పేరు సంబోదు మల్లేశ్. నాకు టేకుమట్లలో చెరువుకింద రెండెకరాలు ఉన్నది. చెరువులో నీరు లేక బోరు కింద యాసంగి సాగు చేస్తున్న. కానీ ఆ బోరులోనూ నీరు అడుగంటింది. అటున్న పైపులు ఇటు పెట్టి, ఇటున్న పైపులు అటుపెట్టి.. మార్చి మార్చి పైపులు తిప్పితే మూడు రోజులకోసారి పంట మొత్తం తడుస్తుంది. మరో నెలరోజులు నీళ్లు అందితేనే పంట చేతికొస్తది. ఇప్పుడే ఎండలు ముదిరినయ్.. నీళ్లు అందుతయే లేదోనని భయమేస్తున్నది. పొద్దంతా బోరు నడిచినా నీరు అందుతలేదు. నీరు లేక మాటిమాటికీ మోటర్ వేసుకుంట.. ఆపుకుంటా నీరు పెడుతున్న. పొద్దున నుంచి సాయంత్రం కరెంట్ పోయే దాకా పొలం కాడనే ఉంటున్న. మధ్యమధ్యలో కరెంట్ ట్రిప్పు అవుతుంది. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో కూడా అర్థం కావడం లేదు. ఇటు కరెంట్ సరిగా రాక.. అటు నీళ్లు లేక పంట చేతికొచ్చుడు కష్టంగనే ఉన్నది.

**- సంబోదు మల్లేశ్, టేకుమట్ల, రైతు, మంచిర్యాల జిల్లా**



బోరు నుంచి నీరు అందక టేకుమట్ల గ్రామంలో ఎండిపోతున్న వరి

# వరికి చేతికొచ్చేనా..!

## సుందిళ్ల బ్యారేజ్‌లో నీరు లేక అడుగంటిన భూగర్భ జలాలు

- బోర్లకింద వేసిన వరికి అందని నీరు
- మరోవైపు కరెంట్ సరిగా సరఫరాకాక తప్పని తిప్పలు
- పొద్దంతా మోటర్ నడిచినా ఫలితం శూన్యం
- పొట్టదశలో పంట ఎండిపోతుందంటూ రైతుల ఆవేదన

*జైపూర్ సమీపంలోని సుందిళ్ల బ్యారేజ్ నీరు లేక వెలవెల బోతుండగా, భూగర్భ జలాలు అడుగంటి వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. అటు బోర్లలో నీళ్లు లేక.. ఇటు కరెంట్ సరిగా సరఫరా కాక పొట్టదశలో ఉన్న వరి చేతికందకుండా పోయే దుస్థితి నెలకొన్నది.*

మంచిర్యాల, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గోదావరి నదిపై ఏర్పాటు చేసిన సుందిళ్ల బ్యారేజ్‌లో నీరు లేకపోవడంతో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వందలాది ఎకరాల పంటలు నష్టపోయే పరిస్థితి వచ్చింది. సుందిళ్ల బ్యారేజ్‌లో నీరుంటే జైపూర్ మండలం మొదలుకొని.. మంచిర్యాల జిల్లా కేంద్రం వరకూ గోదావరిలో బ్యాక్ వాటర్ స్టోర్ ఉండేది. ఎప్పుడు చూసినా గోదావరి నిండు కుండలా కనిపించేది. కానీ, మేడిగడ్డ పిల్లర్‌ను సాకుగా చూపించి జైపూర్ సమీపంలోని సుందిళ్ల బ్యారేజ్, చెన్నూర్ సమీపంలోని అన్నారం బ్యారేజ్‌లలో నీరు ఆపకుండా.. వచ్చిన వరదను వచ్చినట్లు కిందకు వదిలేశారు. దీంతో గోదావరి ఎడారిగా మారిపోయింది. ఈ దెబ్బతో జైపూర్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. చెరువులు ఎండిపోయాయి. దీంతో చెరువులు, బోర్లపై ఆధారపడి సాగు చేసిన వరి పంటకు పొట్టదశలో నీరు అందడం లేదు. పొద్దంతా బోరు నడిపించినా నీరందని దుస్థితి నెలకొంది.

**అడుగంటిన భూగర్భ జలాలు**

ఈ యాసంగిలో జైపూర్ మండలంలో దాదాపు 11 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. బోర్ల కిందే ఇవన్నీ సాగవుతున్నాయి. ప్రస్తుతం మండలంలో భూగర్భ జలాలు అడిగంటిపోవడంతో వందల ఎకరాల్లో వరి ఎండిపోయే దుస్థితి నెలకొంది. మూడేళ్ల క్రితం ఇదే సమయానికి (ఫిబ్రవరి 2023)లో జైపూర్ మండలం కుందారం గ్రామంలో 15.89 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండే. గతేడాది, ఈ ఏడాది గోదావరిలో నీరు లేక నీటిమట్టం ఘోరంగా పడిపోయింది. గతేడాది 18.60 మీటర్లకు, ఈ ఏడాది 18.19 మీటర్ల లోతులో జలాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జైపూర్ మండల కేంద్రంతో పాటు గోదావరి పక్కనే ఉండే ఇందారం, టేకుమట్ల, రామారావుపేట, వేలాల గ్రామాల్లోనూ బోర్లలో నీరు పాతాళానికి పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో చేతికి రావాల్సిన వరి నీరు లేక కండ్ల ముందే ఎండిపోతుందంటూ అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీరందించాలని, లేనిపక్షంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.



ఖానాపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నార్నూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



బోథ్‌లో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆదిలాబాద్‌లో సీఎం ఫొటోను దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# కాంగ్రెస్ మోసాలను ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- పలుచోట్ల అడ్డుకున్న పోలీసులు

ఆదిలాబాద్, ( నమస్తే తెలంగాణ)/నార్నూర్/బోథ్/ ఖానాపూర్, మార్చి 14 : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలపై ప్రశ్నించిన మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని శాసనసభ నుంచి సస్పెండ్ చేస్తారా ? అంటూ శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేశారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను, ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటాన్ని దహనం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ మోసాలపై ప్రశ్నించినందుకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం, అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించకుండా అందరూ సభ్యులకు సమానంగా అవకాశాలివ్వాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీలు 14 నెలలు గడిచినా ప్రజలకు అందడం లేదన్నారు. ఆ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ బెదిరింపు ధోరణికి భయపడకుండా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ ఆందోళనలు చేస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీచౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయనివ్వకుండా బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు యుర్వేత రూప్‌దేవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాశీం, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, ఎస్టీ సెల్ రాథోడ్ సుభాష్, మైనార్టీ సెల్ అలంఖాన్, నాయకులు సుల్తాన్‌ఖాన్, షేక్ మసుద్, ఆనంద్ తదితరులు న్నారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ బీ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, కే గంగారెడ్డి, డాక్టర్ స్వామి, ఎల్క రాజు, అల్లకొండ ప్రశాంత్, రూప్‌చంద్, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

**నిర్మల్ జిల్లాలో..**

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టి అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులను పోలీసులను అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, రాజగంగన్న, శ్రావణ్, దివాకర్, సుమిత్ తదితరులు ఉన్నారు.



నృత్యం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, పోలీస్ అధికారులు, సిబ్బంది



బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# కలర్ ఫుల్ జోష్

- ఊరూరా అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- రంగులు పూసుకొని సందడి చేసిన చిన్నారులు
- నృత్యాలతో యువతీ యువకుల కేరింతలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

*ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కలర్ ఫుల్ జోష్ కనిపించింది. శుక్రవారం ఉదయం నుంచి హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా వీధుల్లోకి వచ్చి రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువతీయువకులు కేరింతలు కొడుతూ నృత్యాలతో హోరెత్తించారు. కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రంగులు పూసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.*

ఎదులాపురం, మార్చి14: ఆదిలాబాద్‌లోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకల్లో భాగంగా కలెక్టర్ రాజర్షి షా, యాపల్‌గూడ రెండవ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, ఎస్పీ అఖిల్ మహాజన్ ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సినిమా పాటలపై నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ డోలు కొడుతూ ఉద్యోగులను ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. హోలీ పండుగను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, సహజ సిద్ధమైన రంగులను వాడాలని సూచించారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయం, ఏఆర్ హెడ్ క్వార్టర్ నుంచి డీజే పాటల మధ్య పోలీసులు నృత్యాలు చేస్తూ ర్యాలీగా క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్పీకి రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ నృత్యం చేశారు. వేడుకలకు పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి , శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..**

బోథ్/భీంపూర్, మార్చి 14 : నేరడిగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మండలాల నాయకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి రంగులు పూసి, హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డా క్టర్ స్వామి, జాదవ్ రూప్‌చంద్, జాదవ్ సంజు, రాథోడ్ రవీందర్, జాదవ్ రవీందర్ పాల్గొన్నారు. భీంపూర్ మండలం అంతర్గాం, భీంపూర్ గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు నేరడిగొండకు వెళ్లి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌తో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.



ఖానాపూర్ టౌన్ : హోలీ వేడుకల్లో నృత్యం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి

**ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

ఎదులాపురం, మార్చి 14 : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్‌చౌక్, అబ్దుల్లా చౌక్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీచౌక్ ప్రాంతాలను పరిశీలించి ట్రాఫిక్ సమస్యను తెలుసుకున్నారు త్వరలోనే వాటికి అందరి సంఘీభావంతో శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని పోలీసులను సూచించారు. హోలీ వేడుకల్లో అనుమతి లేకుండా, వాహనదారులపై రంగులు వేయద్దని ప్రజలకు సూచించారు. ఈత రాని వారు వాగులు, చెరువులు, నదులలోకి దిగవద్దని సూచించారు. ఆయన వెంట డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, పట్టణ సీఐలు సునీల్, శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

# 'హంటర్'కు నివాళి

**పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు**

నిర్మల్ చైన్‌గేట్, మార్చి,14: నిర్మల్ జిల్లా పోలీస్‌శాఖకు విశేష సేవలందించిన 'హంటర్' అనే జాగిలం అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. జిల్లా పోలీసు కార్యాలయంలో హంటర్ పార్థివదేహంపై జిల్లా ఎస్పీ డా. జానకీషర్మిల పుష్ప గుచ్ఛం ఉంచి రెండు నిమిషాల పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మౌనం పాటించి నివాళులర్పించారు. జిల్లా పోలీసు శాఖకు హంటర్ అందించిన సేవలు చిరస్మరనీయమని కొనియాడారు. బెల్జియం మలినోస్ జాతికి చెందిన ఈ జాగిలం 2021లో జన్మించింది. రంగారెడ్డి జిల్లాలోని కెనైన్ ట్రైనింగ్ సెంటర్ ఐఐటీఏ మోయినాబాద్‌లో 8 నెలల శిక్షణ పూర్తి చేసుకున్నది. నిర్మల్ జిల్లా పోలీసు శాఖలో ఫిబ్రవరి, 1, 2022 నుంచి జిల్లాలో పలు చోరీలు, హత్య కేసులను ఛేదించడంలో సేవలందించింది. జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొని ప్రతిభ చాటింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, ఇన్‌స్పెక్టర్లు ప్రేమ్‌కుమార్, కృష్ణ, ఆర్ఐలు రాంనిరంజన్, శేఖర్, రమేశ్, ఎస్ఐలు లింబాద్రి, ఆర్ఎస్ఐలు, జాగిలం సంరక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



హంటర్(జాగిలం)కు నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీసు సిబ్బంది

# నేటి నుంచి పాఠశాలల్లో ఏఐ ప్రోగ్రాం ప్రారంభం

ఎదులాపురం, మార్చి 14 : తలమడుగు మండలంలోని దేవాపూర్ ప్రైమరీ పాఠశాల తెలుగు, ఉర్దూ మీడియంలో, ఖోడద్ ప్రైమరీ, ఆదిలాబాద్ అర్బన్ తాటిగూడ ప్రైమరీ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ప్రోగ్రాం ద్వారా బోధన ప్రారంభిస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం జిల్లా అధికారులు, ఎంఈవోలతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఎస్సీఈఆర్టీ తెలంగాణ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష విద్యాశాఖ మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో(ఎఫ్ఎల్ఎన్)లో కృత్రిమ మేధను ఉపయోగించి బోధనను మెరుగుపరిచేందుకు ఏఎక్స్ఎల్, ఎక్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 9 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. 3, 4, 5వ తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన, గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో 5 కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని విండోస్ -10 తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. హెడ్ సెట్స్ పాఠశాలల్లో అందుబాటులో లేక పోవడంతో కలెక్టర్ అందించారు.